క్లుప్తంగా

నీలకంఠేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న పాదగయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు తదితరులు

పిఠాపురం: మండలంలోని పి.దొంతమూరులో వేంచేసిన రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం కనుల పండువగా జరిగింది. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి లక్ష్మి, కొత్తపల్లి రమణబాబ్జి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి మహా కుంభాభిషేకం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. పిఠాపురం పాదగయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు కూడా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పి.దొంతమూరుతో పాటు పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమస్యల పరిష్కారానికే స్పందన



స్పందనలో సమస్యలు తెలుసుకుంటున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రతి వారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి పరిష్కరిస్తున్నామని అన్నారు. స్పందనకు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామన్నారు. డీఎల్డీఓ కేఎస్‌వీ ప్రసాద్, డీఎల్‌పీఓ బాలామణి, సహకార శాఖ నుంచి మసకపల్లి రంగనాయకులు, గృహ నిర్మాణ శాఖ నుంచి రవిశంకర్, ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష, వ్యవసాయ ఏడీఏ దైవకుమార్, ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ కోర్టును ప్రారంభిస్తున్న బాబ్జిరావు

పెద్దాపురం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని పలువురు వక్తలు అన్నారు. చంద్రమాంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఎస్ఎం జిలాని మెమోరియల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిలాని శిష్య బృందం కమిటీ సభ్యుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభలో వైఎస్సార్ సీపీ నాయకుడు నరాలశెట్టి బాబ్జిరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, పులిమేరు పీఏసీఎస్ అధ్యక్షులు గోపు నారామణమూర్తి, కమ్మిల సుబ్బారావు తదితరులు మాట్లాడారు. క్రీడల్లో రాణించేందుకు ప్రతి ఒక్కరూ శ్రమించాలన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. సర్పంచులు కురిమెళ్ల లోవరాజు, మొయిళ్ల కృష్ణమూర్తి, తుమ్మల నాని, కేదారి నల్లబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పిఠాపురం: కాకినాడ జిల్లా నాల్గో తరగతి ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక పిఠాపురం బాదంవారి సత్రంలో సోమవారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ఏవీఎం లింగదేవర, ఉపాధ్యక్షుడిగా కె.లోవసుధ, ఎస్వీ స్వామి, కార్యదర్శిగా పి.వెంకయ్య, కె.శ్రీదేవి, గౌరవాధ్యక్షుడిగా పి.శివ, ట్రెజరర్‌గా ఎస్. రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

జాతి నిర్మాణంలో యువతదే కీలకపాత్ర

కాకినాడ రూరల్: తిమ్మాపురంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో నెహ్రూ యువ కేంద్రం కాకినాడ, రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్ సోమవారం జరిగింది. దీనికి ప్రిన్సిపల్ డాక్టర్ కె.కమలకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ జాతి నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని అన్నారు. యూత్ పార్లమెంట్‌లతో విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. ఇటీవల మృతి చెందిన విభాగ సహాయ ఆచార్యుడు డాక్టర్ మద్దా సత్యనారాయణ లేనిలోటు స్పష్టంగా కనిపిస్తుందని కమలకుమారి అన్నారు.

చక్కని ప్రణాళికతో పదండి

- పదో తరగతి పరీక్షల్లో ఒత్తిడి వద్దు
- ఏప్రిల్ 3 నుంచి పరీక్షలకు ఏర్పాట్లు
- పెద్దాపురం నియోజకవర్గంలో 17 కేంద్రాలు



సామర్లకోటలో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు ఏడాది పొడవునా ఎంతో కష్టపడి చదువుతారు. తీరా పరీక్షకు హాజరయ్యే సమయంలో తీవ్ర ఒత్తిడితో చదివిన అంశాలు మరిచిపోతుంటారు.. అలాంటివి జరగకుండా పదో తరగతి విద్యార్థులు చక్కని ప్రణాళికతో సాగితే విజయం వరిస్తుందని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మరికొద్ది రోజులే ఉంది. ఈ పరీక్షలు వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్నారు. దీనికి గాను పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో 17 పరీక్ష కేంద్రాలు కేటాయించారు. ఇక్కడ 3,655 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సామర్లకోట పట్టణం, మండలంలో మొత్తం 28 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండగా పదో తరగతి విద్యార్థులు 1,878 మంది, పెద్దాపురం పట్టణం, రూరల్‌లో 24 స్కూల్స్ ఉండగా 1,777 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. ఇదిలా ఉంటే గతంలో ఆరు సబ్జెక్టులకు 11 పేపర్లు ఉండేవి. ప్రస్తుతం ప్రతి సబ్జెక్టుకు ఒక పేపరు చొప్పున ఆరు పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. పరీక్షలకు గడువు సమీపించడంతో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. పరీక్షల సమయంలో కొన్ని మెలకువలు పాటిస్తే ఒత్తిడిని జయించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

అవగాహన.. సాధన

ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులు అవగాహనతో సాధన చేయాలి. తద్వారా ఆయా పాఠ్యాంశాలపై పూర్తి పట్టు సాధించాలని ఉపాధ్యాయులు సూచనలు చేస్తున్నారు. తెలుగు సబ్జెక్టును కొందరు అశ్రద్ధ చేస్తుంటారు. అలా కాకుండా దీనిపైనా శ్రద్ధ వహించాలి. మార్కుల సాధనలో ప్రతి మార్కూ కీలకం అని గ్రహించాలి. హిందీలో పేరాగ్రాఫ్ ప్రశ్నలు బాగా చదివి రాయాలి.

ఇంగ్లిషు పాసెజ్‌లను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుంటే సమాధానాలు సులభంగా రాయవచ్చు. సైన్సు, సోషల్ పరీక్షల్లో మంచి మార్కులు పొందాలంటే ముందు నుంచీ పక్కాగా చదవాలి. గణితంలో అర మార్కు, మార్కు బిట్లపై దృష్టి పెట్టాలి. వాస్తవ సంఖ్యల ఛాప్టర్ ద్వారా మార్కులు సులభంగా పొందవచ్చు. పరీక్ష సమయానికి ముందు కొత్త ప్రశ్నలను చదవడం కంటే చదివిన వాటిని తిరిగి చూసుకుంటే మంచిది. ప్రశ్నపత్రంలో ముందు బాగా వచ్చిన సమాధానాలను రాయాలి. తర్వాత మిగతా వాటిని రాయడం ద్వారా ఒత్తిడి పెరగదు.

ముందే చేరుకోవాలి



విద్యార్థులు ఏమాత్రం ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధం కావాలి. ఇప్పటి వరకూ చదివిన అంశాలనే తిరిగి రివిజన్ చేసుకోవాలి. ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా ఒకటికి రెండు సార్లు చదవాలి. ప్రశ్న పత్రంలో ఏ ప్రశ్న ఇచ్చినా, అది తాము ఏడాది అంతా కష్టపడి నేర్చుకున్న అంశంపైనే ఉంటుందని గమనించాలి. ప్రతి ప్రశ్నకు సమాధానం రాసే ప్రయత్నం చేయాలి. పరీక్ష హాల్‌కు నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలి.

– తోటకూర సాయిరామకృష్ణ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సామర్లకోట

అన్ని ఏర్పాట్లు చేశాం



పదో తరగతి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకోవాలి. మండలంలోని 9 పరీక్ష కేంద్రాల్లో 1,878 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఆయా కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– వై.శివరామకృష్ణయ్య, మండల విద్యాశాఖాధికారి, సామర్లకోట

విజయమే లక్ష్యంగా కలసికట్టుగా సాగాలి

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



సామర్లకోట మండల కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సామర్లకోట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులతో కన్వీనర్లు కలసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ క్యాంప్ కార్యాలయంలో సామర్లకోట, పెద్దాపురం మండలాల్లోని గ్రామాలకు చెందిన కన్వీనర్లతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామానికి నియమించిన గృహ సారథుల ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని ఆయా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల దృష్టికి తీసుకురావాలన్నారు. అప్పటికీ పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత గ్రామ కన్వీనర్లపై ఉంటుందని తెలిపారు. సామర్లకోటకు చెందిన తనకు పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేద్దామన్నారు. ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గరవసాని సూరిబాబు, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, ఉటా వాసు, మలకల వరహాలబాబు, మండల పార్టీ అధ్యక్షుడు అచ్చిరాజు పాల్గొన్నారు.

రాగి జావలో పోషక విలువలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు శ్రీలక్ష్మి

సామర్లకోట: రాగి జావలో అనేక పోషక విలువలు ఉంటాయని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషణ పక్వాడ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష మాట్లాడుతూ మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావ అందించనున్నారని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజానికి ఫాస్ట్ ఫుడ్స్‌ను దూరం పెట్టాలన్నారు. హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడుతూ జగనన్న గోరుముద్దను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం ఆఫీసర్ ఎస్.విష్ణు అన్నారు. ఆరోగ్య సిబ్బంది చంద్రకళ, నిర్మల, ఉపాధ్యాయులు కె.అరుణ, జి.గోవిందు, వి.రాజు, కె.శ్రీనివాసు, సీహెచ్ లక్ష్మీదుర్గ పాల్గొన్నారు.

నేటి నుంచి అమలు

సామర్లకోట: ప్రభుత్వ నిర్ణయం మేరకు మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పోషక విలువలు కలిగిన రాగి జావను మంగళవారం నుంచి అందిస్తామని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వేట్లపాలెం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. వారంలో రెండు రోజుల పాటు మధ్యాహ్న భోజనంతో రాగి జావ ఇస్తామని చెప్పారు.

అకాల వర్షం.. అపార నష్టం

- నేలకొరిగిన వాణిజ్య పంటలు
- తడిసి ముద్దయిన నువ్వు పంట
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో నేలనంటిన నువ్వు పంట



గొల్లప్రోలు మండలంలో వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న అధికారులు



చేబ్రోలులో నేల రాలిన మామిడి



వన్నెపూడిలో దెబ్బతిన్న బొప్పాయి తోటలు

పిఠాపురం: అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి. వర్షానికి పిఠాపురం నియోజకవర్గంలో వాణిజ్య, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. పలు గ్రామాల్లో వాణిజ్య పంటలైన మిరప, పత్తి, బెండ, టమాటా, దొండ, వంగ, బీర, అరటి, మామిడి, బొప్పాయి, మునగ తదితర పంటలు నేలకొరిగాయి. అకాల వర్షంతో నువ్వు చేలకు తీరని నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది గొల్లప్రోలు, చేబ్రోలు, దుర్గాడ, ఎ.విజయనగరం, చెందుర్తి, తాటిపర్తి గ్రామాల్లో సుమారు 500 ఎకరాల పైబడి రైతులు నువ్వును సాగుచేశారు. ఈ ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా పండింది. ప్రస్తుతం కోతదశకు చేరుతున్న దశలో వర్షం కురవడంతో భారీ నష్టం సంభవించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. మరో పక్క వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

గొల్లప్రోలు మండలంలో..

పిఠాపురం: అకాల వర్షాలకు గొల్లప్రోలు మండలంలో 18 హెక్టార్లలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్టు ఉద్యానశాఖాధికారి అరుణ్‌కుమార్ తెలిపారు. గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న అరటి, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలో 18 హెక్టార్లలో అరటి పంట దెబ్బతినగా బొప్పాయి 6 హెక్టార్లలోనూ, పూల తోటలు 4 హెక్టార్లలోనూ, కూరగాయల పంటలు 78 హెక్టార్లలోనూ దెబ్బ తిన్నాయన్నారు. కొత్తపల్లి మండలంలో అరటి పంటలు 10 హెక్టార్లలో దెబ్బతిన్నాయన్నారు. వర్షాల వల్ల ఎవరి పంటలైనా దెబ్బతింటే సమీప రైతు భరోసా కేంద్రానికి సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. మండలంలో పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



మాధవపట్నంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సోమవారం మాధవపట్నంలో గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో దొరబాబు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వివిధ పథకాల ద్వారా మూడున్నరేళ్లలో పొందిన లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి ఆయన వివరించారు. అవ్వా, తాతలను కలిసి పింఛన్లు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని ఆయన గుర్తు చేశారు. లబ్ధిదారులకు పథకాలు అందుతున్నాయా లేదా అనే విషయాలను తెలుసుకోవడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి సాధనాల నాగఫణిబాబు, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, వుటా వాసు, పార్టీ నాయకులు హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి తీర్థం



పడుకున్న భక్తులపై దున్నపోతును నడిపిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాద్‌లో పోలేరమ్మతల్లి తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి జాగారం చేశారు. ఇక్కడ అమ్మవారి జాతరలో పూర్వం నుంచి కొనసాగుతున్న వింత ఆచారంలో భాగంగా దున్నపోతును తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, గరగనృత్యాల నడుమ దున్నపోతును గ్రామంలో ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. ఉపవాసం ఉన్న భక్తులు పసుపునీళ్లతో స్నానంచేసి అమ్మవారి ఆలయం ఎదురుగా బారులు తీరి పడుకున్నారు. వారిమీదుగా దున్నపోతును నడిపించారు. అలా మూడు పర్యాయాలు భక్తులు దున్నపోతుతో తొక్కించుకున్నారు. అలా తొక్కడం వల్ల గ్రామానికి ఉన్న అరిష్టం పోవడంతో పాటు వారి కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఏటా క్రమం తప్పకుండా ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గతంలో ఈ దున్నపోతును బలి ఇచ్చేవారు. ప్రస్తుతం పూజల అనంతరం దున్నపోతును విడిచిపెట్టేస్తున్నారు. ఈ వింత ఆచారాన్ని తిలకించేందుకు మండలంలో నలుమూలల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మూలపేటలోనూ పోలేరమ్మ తల్లి తీర్థం ఘనంగా నిర్వహించారు.



ఆలయ ఆవరణలో పడుకున్న భక్తులు

నేడు నూకాలమ్మ తీర్థం

కొత్తపల్లి: మండలంలోని యండపల్లిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో నూకాలమ్మ జాతర



సామర్లకోట జాతరలో డప్పుల నృత్యం

సామర్లకోట: కొత్త అమావాస్యను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద జాతర ప్రారంభమైంది. ఇక్కడ నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు గరగల నృత్యం, బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పుల మధ్య ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పురవీధుల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ జాతర నిర్వహించారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పిఠాపురం: గొల్లప్రోలు గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారి జాతర సోమవారం ఘనంగా జరిగింది. కౌన్సిలర్ గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గరగల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

దంతాలను సంరక్షించుకోవాలి



పెద్దాపురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెద్దాపురం: దంతాలను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలని పెద్దాపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.సూర్యకుమారి అన్నారు. జాతీయ దంత పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్యకుమారి, దంత వైద్యురాలు ఆర్.రాధాకుమారి మాట్లాడారు. రోజూ ఉదయం, సాయంత్రం దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. చిగుళ్ల సమస్య రాకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు. హెడ్ సిస్టర్ రత్నకుమారి, ఏపీ చలపతి, నీలిమ, జగపతి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: దంత పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానికంగా ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ దంత సమస్యలను అశ్రద్ధ చేయవద్దన్నారు. స్థానిక లయన్స్ క్లబ్‌లో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, క్లబ్ మాజీ అధ్యక్షుడు కర్రి ఆదినారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో వైద్యులు శ్రీలక్ష్మి, వల్లీ పాల్గొన్నారు.

నకిలీ ఆయిల్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయిల్ డబ్బాలు

పిఠాపురం: గొడ్డు మాంసం కొవ్వుతో ఆయిల్ తయారు చేసి నెయ్యిగా అమ్ముతున్నారనే సమాచారంతో పిఠాపురం పట్టణ పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. పట్టణ ఎస్సై జగన్మోహన్ కథనం ప్రకారం... గొడ్డు మాంసం కొవ్వును నిల్వ చేసి కరగబెట్టి నెయి తయారు చేస్తున్నట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెయ్యిని స్థానిక హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో స్థానిక ఇందిరా నగర్‌లో ఒక ఇంటిపై దాడి చేయగా పది డబ్బాల్లో ఆయిల్ పట్టుబడింది. ఆయిల్ తయారు చేస్తున్నట్లు భావిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. పట్టుకున్న ఆయిల్‌ను ఆహార తనిఖీ అధికారులకు ఇచ్చి, టెస్టింగ్ అనంతరం అది నకిలీ ఆయిల్ అని నిర్ధారణ అయితే నిందితులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

చేపల పట్టుబడికి అనుమతి ఇవ్వండి

కాకినాడ సిటీ: చెరువుల్లో వేసిన చేపలు పట్టుకునేందుకు పంచాయతీ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని, పట్టుబడికి అనుమతి ఇవ్వాలంటూ గొల్లప్రోలు మండలం చెందుర్తి, కొడవలి గ్రామాలకు చెందిన రైతులు జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డిని సోమవారం కలసి వినతి పత్రం అందించారు. శ్రీశ్రీనివాసా ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు చెందిన 350 మంది కుటుంబాలు రెండు చెరువుల్లో చేపలు పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఇప్పుడు కొందరు వ్యక్తులు పంచాయతీ అధికారులను మభ్యపెట్టి తమ చెరువుల్లో వేసిన చేపలను పట్టుకునేందుకు అభ్యంతరం చెబుతున్నారని రైతులు డీఆర్వో ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ ప్రజా సంక్షేమ సంఘ అధ్యక్షుడు వాసంశెట్టి రాజేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు బత్తిన వెంకటరమణ, ఉపాధ్యక్షుడు కండిపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.